## నేను మళ్లీ ఎమ్మెల్యేనైతే..



### నో వర్క్ జోన్‌గా రాజానగరం అభివృద్ధి

రాజానగరం: ఎన్నికల్లో మళ్లీ నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. నియోజకవర్గాన్ని నో వర్కు జోన్‌గా అభివృద్ధి చేస్తానని మాటిస్తున్నా. ఇంటింటికీ గోదావరి జలాలు సరఫరా ఆచరణలోకి వచ్చేలా, అనతి కాలంలోనే పనులు పూర్తి అయ్యేలా కృషి చేస్తా. సీతానగరం, కోరుకొండ మండలాల్లోని రైతుల వరదల సమయంలో పడుతున్న ఇబ్బందులను నివారించే దిశగా చేపట్టిన తొర్రిగడ్డ రివర్స్ పంపింగ్ స్కీమ్ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తా. అంతేకాదు, నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా పారిశ్రామిక ప్రగతికి కృషి చేస్తా. ఇందుకు సంబంధించి నాకు ఓ విజన్ ఉంది. అది కార్యరూపం దాల్చేవిధంగా ఈ ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు చేసి, విజయాన్ని అందించండి.

– జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి, రాజానగరం

### ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా



పెదపూడి: రానున్న ఎన్నికల్లో గెలిచి కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి అనపర్తి నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాను. నియోజకవర్గంలోని ప్రభుత్వ ప్రాథమిక, సామాజిక, ఏరియా ఆస్పత్రుల అభివృద్ధికి కృషి చేస్తాను. గత ఐదేళ్లలో సుమారు 11,089 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశాను. ఇంకా ఎవరెవరికి ఇళ్ల స్థలాలు కావాలో గుర్తించి అందరికీ సొంతింటి కల నెరవేరుస్తాను. పంట పొలాలకు సాగునీరు సక్రమంగా పూర్తి స్థాయిలో అందేలా పంట, మురుగు కాలువల ఆధునీకరణ చేపడతాను. నియోజకవర్గంలోని ముఖ్య కూడళ్లు, గ్రామీణ రహదారుల నిర్మాణానికి కృషి చేస్తాను. నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సౌకర్యాలు కల్పిస్తాను. గ్రామాల్లో కాపు, బీసీ, ఎస్సీ, ఇతర సామాజిక వర్గాల భవనాల నిర్మాణాన్ని దశలవారీగా నిర్మిస్తాను. అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తాను.

– అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

# ఫ్యాన్ జోరు.. ఆపలేరు

- ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ హవా
- అంతటా వీస్తున్న ఫ్యాన్ గాలి
- ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డికి అనుకూల పవనాలు
- మాజీ ఎమ్మెల్యేకు అవినీతి మరకలు



పెదపూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ఎన్నికల పోలింగ్ దగ్గర పడింది. ఫ్యాన్ గాలి జోరందుకుంది. వైఎస్సార్ సీపీ ప్రచారం హోరెత్తుతోంది. ప్రజా సంక్షేమాన్ని ప్రతి గడపకూ తీసుకొచ్చిన జగనన్నకే తమ మద్దతు అన్న మాట ప్రతి నోటా వినిపిస్తోంది. నడవలేని వృద్ధులైనా, భవిష్యత్తుకు బాటలు వేసుకునే విద్యార్థులైనా, కుటుంబాన్ని నడిపించే అక్కచెల్లెమ్మలైనా అందరిదీ అదే మాట.. గత ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ ఫలాలు అందుకున్న నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలు ఈ ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారు. 2019లో ఎన్నికలో 55,208 ఓట్ల భారీ మెజార్టీ సాధించిన ఆయన ఈసారి ఆ రికార్డును తిరగరాస్తానన్న ధీమాతో దూసుకెళుతున్నారు.

**నిస్వార్థ రాజకీయానికి నిలువెత్తు నిదర్శనం**

వైద్యం అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారిపోయిన ఈరోజుల్లోనూ కేవలం రూ.10 ఫీజుగా తీసుకుని వైద్యం అందించే ప్రజా వైద్యుడు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి. నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాలే కాకుండా మండపేట, రాయవరం మండలాల నుంచి వచ్చే ఎంతోమంది రోగులకు తన హస్తవాసితో సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించారన్న పేరు సంపాదించుకున్నారాయన. అవినీతికి ఆమడ దూరంగా నిస్వార్థంగా రాజకీయం చేసే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి ప్రజల్లో అమితమైన ఆదరణ ఉంది. ఎమ్మెల్యేగా ప్రజా సేవ, డాక్టర్‌గా వైద్య సేవలతో సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారు. సర్వే సంస్థలన్నీ రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలిచే సీట్లలో మొదటిదిగా అనపర్తి పేరే చెబుతున్నారంటే ఆయన హవాను అర్థం చేసుకోవొచ్చు. ఒకవైపు వైద్యుడిగా, మరోవైపు ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నా అటు ప్రజలకు, ఇటు పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ ఆయన అందుబాటులో ఉంటారు. ఎవరైనా అర్ధరాత్రి ఫోన్ చేసినా సరే స్పందించి వారికి సాయమందించడంలో ముందుంటారు. ఈ లక్షణం వల్లే ఆయన ప్రజల్లోను, పార్టీ కార్యకర్తల్లోనూ ఎనలేని అభిమానాన్ని సంపాదించుకున్నారు.

**అభివృద్ధితో ప్రత్యేక ముద్ర**

డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఒకవైపు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరవేస్తూనే మరోవైపు నియోజకవర్గంలో అభివృద్ధికి పెద్దపీట వేశారు. నియోజకవర్గ కేంద్రమైన అనపర్తిలో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ ఏరియా ఆస్పత్రిగా మార్చి 24/7 మెరుగైన వైద్యసేవలు అందేలా కృషి చేశారు. అలాగే మండల కేంద్రమైన పెదపూడిలో రూ.7 కోట్లతో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేశారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా సుమారు రూ.40 కోట్లతో పైపులైన్ ఆధునీకరణ, వాటర్ ట్యాంకుల నిర్మాణంతో తాగునీటి సమస్యకు చెక్ పెట్టారు. లోఓల్టేజ్ సమస్య పరిష్కారం కోసం రంగంపేట, బిక్కవోలు, పెదపూడి మండలాల్లో నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా నడిపించడంలో తనదైన ముద్ర వేశారు. నియోజవవర్గంలోని 58 గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రజలకు మరింత చేరువయ్యారు. అలాగే నియోజకవర్గంలో సుమారు 11,089 మందికి ఇళ్ల స్థలాలు అందించగా ఇప్పటికే వాటిలో సుమారు 3,008 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. అనపర్తి నియోజకవర్గం చరిత్రలోనే ఇదొక రికార్డుగా నిలిచిపోయింది. పైగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో అన్ని వర్గాల అభిమానాన్ని సంపాదించుకున్నారు.

### కూటమికి భంగపాటు

ఒకవైపు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి, తనయుడు డాక్టర్ గౌతంరెడ్డి నియోజకవర్గంలోని గ్రామాల్లో హోరాహోరీగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి మహిళలు ఎదురేగి హారతులిచ్చి ఘన స్వాగతం పలుకుతున్నారు. అభిమానులు అడగడుగునా పూల జల్లులు, గజమాలలతో సత్కరించి ఆదరిస్తున్నారు. మరోవైపు ఆఖరి నిమిషంలో టీడీపీని వీడి బీజేపీ టికెట్ దక్కించుకున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రచారంలో పూర్తిగా వెనకబడిపోయారు. అంతేకాదు టీడీపీ టికెట్ రాలేదన్న అక్కసుతో తన మనుషులతో సైకిల్‌ను అనపర్తి మురికి కాలువలో పడేయించేందుకు చేసిన ప్రయత్నాలు సామాన్య టీడీపీ కార్యకర్తలకు మింగుడు పడడం లేదు. దీంతో ప్రస్తుతం ఆయన పరిస్థితి రెంటికి చెడ్డ రేవడైంది. అంతేకాదు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఉండగా తీవ్ర అవినీతిపరుడిగా పేరుగాంచడంతో నియోజకవర్గ ప్రజల్లో స్వతహాగానే వ్యతిరేకత ఉంది. దానికి తోడు ప్రస్తుతం ఆయన టీడీపీని వీడి బీజేపీలో చేరడంతో ఉన్న కాసింత గ్రాఫ్ పడిపోయింది. పైగా బీజేపీ గుర్తుపై పోటీతో కార్యకర్తల్లోనూ అయోమయం నెలకొంది. ఇవన్నీ ఆయనకు ప్రతికూలాంశాలుగా పరిణమించాయి. అందుకే రానున్న ఎన్నికల్లో నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి మళ్లీ భంగపాటు తప్పదన్న చర్చ ప్రజల్లోనే కాదు టీడీపీ, బీజేపీ శ్రేణుల్లో సైతం సాగుతోంది.

### బాధ్యతగా యూనివర్సిటీ అభివృద్ధికి కృషి



వీసీ ఆచార్య పద్మరాజును సత్కరిస్తున్న సిబ్బంది

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉప కులపతిగా ఆచార్య కె.పద్మరాజు ఆ పదవిని చేపట్టి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ క్యాంపస్‌లోని బోధన, బోధనేతర సిబ్బందితో పాటు, తాడేపల్లిగూడెం, కాకినాడ క్యాంపస్‌ల ఉద్యోగులు మొదటి వార్షికోత్సవాన్ని యూనివర్సిటీ సెమినార్ హాలులో శుక్రవారం నిర్వహించారు. ఏడాది కాలంలో యూనివర్సిటీ సాధించిన ప్రగతిపై వార్షిక నివేదికను సమర్పించారు. వీసీ ఆచార్య పద్మరాజు మాట్లాడుతూ యూనివర్సిటీ ఈ స్థాయి రావడానికి కారకులైన పూర్వ వీసీల సేవలను మననం చేసుకున్నారు. వారి స్ఫూర్తితో తాను వీసీ పదవిని హోదాగా కాకుండా, ఓ బాధ్యతగా భావించి, యూనివర్సిటీ ప్రగతికి కృషి చేస్తున్నానని, ఏడాది కార్యకలాపాలను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, తాడేపల్లిగూడెం, కాకినాడ క్యాంపస్‌ల ప్రిన్సిపాళ్లు టి.అశోక్, ఎం.కమలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

# పెత్తందార్ల కూటమిని తరిమేద్దాం

- సంక్షేమ సారథి జగనన్నకు పట్టం కడదాం
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి జక్కంపూడి రాజా

మధురపూడి: తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఏర్పడిన పెత్తందార్ల కూటమిని తరిమేద్దామని, సంక్షేమ పథకాల సారథి జగనన్నకు పట్టం కడదామని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. కోరుకొండ మండలం నిడిగట్ల, బూరుగుపూడి, రాఘవపురం, కోటికేశవరం, గాదరాడల్లో ఆయన విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంలో అన్ని పల్లెలు గణనీయమైన ప్రగతి సాధించాయన్నారు. సచివాలయాల నుంచి మౌలిక వసతుల కల్పన జరిగిందన్నారు. రూ.1,773 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించినట్టు, రూ.1,377 కోట్లతో సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించినట్టు వివరించారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా లబ్ధిని జమ చేసినట్టు పేర్కొన్నారు. సొంతిల్లు లేని నిరుపేదలు 20,170 మందికి ఇళ్ల స్థలాల పట్టాలిచ్చినట్టు తెలిపారు. పలు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు ఆయన ఘనంగా నివాళులర్పించారు.



బూరుగుపూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జక్కంపూడి రాజా


**బూరుగుపూడిలో గజమాలతో సత్కారం**

ఎన్నికల ప్రచారం బూరుగుపూడిలో ఉత్సాహంగా సాగింది. ఎమ్మెల్యే రాజా ప్రచార రథంపై పూలవర్షం కురిసింది. గజమాలతో ఆయనకు ఘన సత్కారం చేశారు. స్థానిక కంటే వారి మైదానంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఏఎంసీ జిల్లా కమిటీ సభ్యుడు కంటే వినయ్‌తేజ బొమ్మలు ఆకట్టుకున్నాయి. ఉప్పుతో ఈ మూడు బొమ్మలను తీర్చిదిద్దారు. జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ మండల కన్వీనర్లు అడపా కనకరాజు, గణేశుల పోసయ్య. సీనియర్ నాయకులు ములగాఢ ఫణి, క్రొవ్విడి సత్రాజు, నాయకులు తిరుమలశెట్టి సత్యనారాయణ, యడ్ల సత్యనారాయణ, హరిబోలు చినబాబు, ముడే కామేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పుతో చిత్రీకరించిన బొమ్మలు

# ప్రజల మద్దతే శ్రీరామరక్ష



రామవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



ఫ్యాను గుర్తుకు ఓటేయాలని కోరుతున్న డాక్టర్ గౌతమ్‌రెడ్డి దంపతులు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- రామవరంలో ఎన్నికల ప్రచారం

అనపర్తి: నియోజకవర్గ ప్రజల మద్దతే తనకు శ్రీరామరక్ష అని, ప్రజల ఆశీస్సులతోనే తిరిగి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రామవరంలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, పార్టీ నాయకుల చుట్టూ తిరిగాల్సిన పరిస్థితులు దూరమయ్యాయన్నారు. అర్హతే ప్రామాణికంగా, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలను ఇంటి ముంగిటకే అందించామన్నారు. ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాల ప్లస్ ఎన్నికల మేనిఫెస్టోతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మరింత మేలు చేకూరతుందన్నారు. ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సంక్షేమ పాలనను మళ్లీ తెచ్చుకుందామంటూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ గిరడా గంగాభవాని, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, ఎంపీటీసీలు గొలుగూరి గౌతమి, నల్లమిల్లి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం**

అనపర్తి పాతవూరులో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు సత్తి ఆదిలక్ష్మి, మండలంలోని పెడపర్తిలో ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి తనయుడు, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ సత్తి గౌతమ్‌రెడ్డి, ప్రియాంక దంపతులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, గత 58 నెలలుగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని వివరించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అండగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### స్వరూప్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం

రాజానగరం: దివాన్‌చెరువు శివారు స్వరూప్‌నగర్‌లో స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తరఫున ఆయన బంధువు జక్కంపూడి శ్రావ్య శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికీ పర్యటించారు. ఈ ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజాను, రాజమండ్రి ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.



స్వరూప్ నగర్‌లో ప్రచారం చేస్తున్న శ్రావ్య తదితరులు

## క్లుప్తంగా

### 1,376 పోస్టల్ బ్యాలెట్ల నమోదు

రాజానగరం: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు నియోజకవర్గంలో 1,376 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని రిటర్నింగ్ అధికారి ఎ. చైత్రవర్షిణి తెలిపారు. వీరిలో వయోవృద్ధులు 98 మంది తమ ఇంటి వద్దనే ఓటు చేయగా, ఎన్నికల విధులు నిర్వర్తించే వారిలో 1,244 మంది, ఎన్నికల నిర్వహణకు అవసరమైన సేవలందిస్తున్న 34 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారన్నారు.

### ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలు

రాజానగరం: నియోజకవర్గంలో ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణి తెలిపారు. మండలానికి ఒకటి చొప్పున సీతానగరం మండలం చినకొండేపూడిలోని ఎంపీపీ స్కూలు (పోలింగ్ బూత్ నం.20), కోరుకొండ మండలం దోసకాలయపల్లిలోని మహాత్మాగాంధీ జెడ్పీ ఉన్నత పాఠశాల (పోలింగ్ బూత్ నం.114), రాజానగరం మండలం లాలాచెరువు హెచ్‌బీ కాలనీలోని ఎంపీపీ స్కూలు (పోలింగ్ బూత్ నం.147) లో మోడల్ పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. వీటితోపాటు మహిళల కోసం రాజానగరం మండలం, లాలాచెరువు హెచ్‌బీ కాలనీలోని జెడ్పీ ఉన్నత పాఠశాల (పోలింగ్ బూత్ నం .145), దివ్యాంగుల కోసం కోరుకొండ మండలం, బుచ్చింపేటలోని పోలింగ్ బూత్ నం .63ని మోడల్ పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేశామని తెలిపారు.

### సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వడిశలేరులో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రంగంపేట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.చిన్నారావు కోరారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వడిశలేరులో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. శిబిరంలో 412 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సి.శ్రీహర్ష, జీఎల్ రసజ్ఞ, ఎం.ఇందిర, పంచాయతీ కార్యదర్శి పి.సుబ్బారాయుడు, కాత్యాయనీ, సీహెచ్ఓ కె.జయమణి, ఎంపీహెచ్ఓ పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: మండలంలోని దుప్పలపూడికి చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామంలోని కోనేటి వీరబాబు, కూరాకుల రాజు తదితరులు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి వైఎస్సార్ సీపీ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

### ఫ్యామిలీ ఫిజీషియన్‌లో వైద్య సేవలు



చినకొండేపూడిలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: చినకొండేపూడిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్ రాజు శుక్రవారం 378 మందికి వైద్యసేవలు అందించారు. వారికి అవసరమైన పరీక్షలు చేసి, ఉచితంగా మందులను అందించారు. మంచంపై ఉన్న రోగుల వద్దకు నేరుగా వెళ్లి వారిని పరీక్షించారు. అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించి, పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. గ్రామంలో వేసవి వడగాల్పుల నుంచి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించారు.

### మజ్జిగ పంపిణీ

సీతానగరం: చినకొండేపూడి నాలుగు బొమ్మల సెంటర్ వద్ద చలివేంద్రంలో శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. షిర్డీసాయిబాబా వసతి మందిరం సేవా సమితి ఆధ్వర్యంలో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా, బోడ సుబ్బరాజు జ్ఞాపకార్థం అతడి కుమారుడు భీమరాజు మజ్జిగను అందించారు.